
బోధన్ పట్టణం 4వ వార్డు నర్సాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ దేగావత్ ధూప్‌సింగ్ నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు


తాడ్‌బిలోలి గ్రామంలో ప్రధాన వీధుల గుండా బీఆర్‌ఎస్ భారీ ర్యాలీ

# ప్రజలంతా బీఆర్‌ఎస్ వెంటే..

- ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా పార్టీ నాయకుల ప్రచారం

బోధన్, నవంబర్ 4: ప్రజలంగా బీఆర్‌ఎస్ పార్టీ వెంటే ఉన్నారని, విజయం బీఆర్‌ఎస్ పార్టీదేనని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని 4వ వార్డు నర్సాపూర్ గ్రామంలో వార్డు కౌన్సిలర్ దేగావత్ ధూప్‌సింగ్ నాయక్, పార్టీ సీనియర్ నాయకులు ఎండీ ఉస్మాన్, ఎస్టీసెల్ పట్టణ అధ్యక్షుడు జాదవ్ ప్రవీణ్‌నాయక్‌తోపాటు పలువురు పార్టీ కార్యకర్తలు, ప్రజలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. నాయకులు ప్రజలకు తెలిపారు. అయితే, ప్రజల్లో తెలంగాణ సంక్షేమ పథకాల్లో మంచి అవగాహన ఉందని, ప్రజలంగా బీఆర్‌ఎస్ పార్టీవైపే మొగ్గు చూపుతున్నారని, మరోమారు మహ్మద్ షకీల్ విజయం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

**బోధన్‌లో బీఆర్‌ఎస్ ప్రచారం**

శక్కర్‌నగర్, నవంబర్ 4: బోధన్ పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరుగా సాగుతోంది. బోధన్ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఆయా వార్డులకు చెందిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, నాయకులు ప్రజలతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. ప్రతి వార్డులో ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. 35వ వార్డులో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం పట్టణ అధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ తదితరులు ప్రజలతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

**రెంజల్ మండలంలో బీఆర్‌ఎస్ జోష్**

రెంజల్, నవంబర్ 4: బోధన్ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ తరఫున పార్టీ నాయకులు ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో మహిళలు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ప్రజలు బీఆర్‌ఎస్‌కు జై కొడుతుండడంతో ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకుల్లో జోష్ పెరుగుతోంది. గడపగడపకూ తిరుగుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన ఎన్నికల మ్యానిఫెస్టోను వివరించారు. తాడ్‌బిలోలి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార ర్యాలీలో యువత, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారని బీఆర్‌ఎస్ జిల్లా మైనార్టీ నాయకుడు మౌలానా పేర్కొన్నారు.


**నవీపేట మండలంలో..**

నవీపేట, నవంబర్4: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్‌కు మద్దతుగా ఆపార్టీ నాయకులు జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలోని నాళేశ్వర్, నవీపేట, నిజాంపూర్, లింగాపూర్, రాంపూర్, పోతంగల్ తదితర గ్రామాల్లో స్థానిక సర్పంచులు, ఎంపీటీసీల ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**బోధన్ మండలంలో..**

బోధన్ రూరల్, నవంబర్ 4: బోధన్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే షకీల్‌కు మద్దతుగా ఆపార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే షకీల్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిర్పా సుదర్శన్ తదితరులుపాల్గొన్నారు.


సాలూరా మండలం కుమ్మన్‌పల్లిలో ..


నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామంలో ..


బోధన్‌లోని 35వ వార్డులో..

సాలూరా మండలంలో పార్టీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బోధన్ ఎంపీపీ బుద్దెసావిత్రీరాజేశ్వర్, బీఆర్‌ఎస్ నాయకుడు బుద్దె రాజేశ్వర్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సన్న, ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయి, వైస్ చైర్మన్ సాలూరా షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేవైఎం నుంచి భారత జాగృతిలోకి చేరికలు


భారత జాగృతిలో చేరిన బీజేవైఎం యువకులతో భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు, బోధన్ నియోజకవర్గ కన్వీనర్ అవంతిరావు, గట్టు హరికృష్ణ

బోధన్, నవంబర్ 4: పట్టణంలోని పలు వార్డులకు చెందిన బీజేవైఎం యువ నాయకులు శనివారం భారత జాగృతిలో చేరారు. పట్టణంలోని సరస్వతీ నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేవైఎంకు చెందిన యువ నాయకుడు వెంకట శివసాయి ఆధ్వర్యంలో సుమారు 80 మంది యువకులు భారత జాగృతిలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు అవంతిరావు జాగృతి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత జాగృతిలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని, ఇందుకు తగినట్టుగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, బూత్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భారత జాగృతి సమితి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న విషయం మీకందరికీ తెలుసని అన్నారు. ఏపని కావాలన్నా, ఎమ్మెల్సీ కవిత ద్వారా చేయించుకుందామని ఆయన వారికి హామీ ఇచ్చారు. భారత జాగృతిలో చేరిన వెంకట శివసాయిని పట్టణ జాగృతి అధ్యక్షుడిగా నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు అవంతిరావు ప్రకటించారు. నిత్యం తనతోపాటు, బోధన్ నియోజకవర్గ కన్వీనర్ గట్టు హరికృష్ణ కూడా అందుబాటులో ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా వెంకట శివసాయి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్షుడికి, బోధన్ నియోజకవర్గ కన్వీనర్లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు గట్టు హరికృష్ణ, భారత జాగృతిలో చేరిన రాజేశ్, శివప్రసాద్, సాయినాథ్, తేజ, సాయి ప్రసాద్, విజయ్, రాము, శ్రావన్, బి.వినయ్, నాగేశ్, శివసాయి, వీరేందర్ సింగ్, కశ్మీర్ సింగ్, రోహిత్, లడ్డు, నవతేజ పాల్గొన్నారు.

## చట్టాలను సమగ్రంగా అమలు చేయాలి

శక్కర్‌నగర్, నవంబర్ 4: ఎన్నికల సందర్భంగా చట్టాలను పోలీసులు సక్రమంగా, సమగ్రంగా అమలు చేయాలని బోధన్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి సూచించారు. ప్రతినెలా మొదటి శనివారం రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి, జిల్లా ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సమావేశంలో భాగంగా బోధన్ న్యాయస్థానంలో పోలీసులకు ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్‌లోని పలు పోలీస్ స్టేషన్లకు చెందిన ఎస్సైలు, ఏఎస్సైలు, లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.


పోలీసులకు సూచనలు చేస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి

## గౌడ ఆత్మీయ సమ్మేళనం వాయిదా

శక్కర్‌నగర్, నవంబర్ 4: బోధన్ పట్టణంలో నియోజకవర్గంలోని గౌడ కులస్తులతో ఈనెల 6న నిర్వహించాల్సిన గౌడ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని అనివార్య కారణాలతో ఈనెల 8కి వాయిదా వేసినట్లు గౌడ సేవా సమితి డివిజన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పి.గంగాధర్ గౌడ్ వెల్లడించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ సూచనల మేరకు ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, తిరిగి పట్టణంలోని కౌండిన్య గౌడ సంఘం కల్యాణ మండపంలో 8వ తేదీన నిర్వహిస్తామని ఆయన తెలిపారు. 8న ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు, స్థానిక బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ కూడా వస్తున్న కారణంగా గౌడ కులస్తులు, కుటుంబ సభ్యులతో వచ్చి తమ సాధక బాధకాలను వారికి నివేదించాలని ఆయన కోరారు. 8న నిర్వహించనున్న ఆత్మీయ సభను విజయవంతం చేసేందుకు నియోజకవర్గంలోని గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని గంగాధర్ గౌడ్ కోరారు.

## 8న గౌడ ఆత్మీయ సమ్మేళనం

ఎడపల్లి, నవంబర్ 4: ఈనెల 8న బోధన్‌లో గౌడ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే షకీల్ సహకారంతో నిర్వహించనున్నట్లు ఎడపల్లి మండల గౌడ సంఘం ప్రతినిధి రవీందర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే షకీల్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ హాజరవుతారని పేర్కొన్నారు. ఎడపల్లి మండల గౌడ కులస్తులు తరలిరావాలని కోరారు.

# సాలూరా చెక్‌పోస్ట్ తనిఖీ

బోధన్ రూరల్ , నవంబర్ 4: ఎన్నికల నియమావళిలో భాగంగా సాలూరా మండల శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శనివారం ఎన్నికల వ్యయ ఆఫీసర్ తానియా సింగ్ తనిఖీ చేశారు. సాలూరా మండల కేంద్రంలోని చెక్‌పోస్ట్ వద్ద సిబ్బంది పనితీరును పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. మహారాష్ట్ర నుంచి వచ్చే వాహనాలను ముమ్మరంగా తనిఖీలు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాల గొప్పవన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. అధికారులకు ఎదైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.


సాలూరా చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న తానియా సింగ్

## రెండో రోజు మరో నామినేషన్ దాఖలు

శక్కర్‌నగర్, నవంబర్ 4: బోధన్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రెండో రోజు శనివారం కాంగ్రెస్ అభ్యర్థి పి.సుదర్శన్‌రెడ్డి తరఫున ఆ పార్టీ నాయకులు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. రెండు మార్లు ఆ పార్టీకి చెందిన నాయకులు రెండు సెట్లను వేర్వేరుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో బి.రాజాగౌడ్‌కు అందజేశారు. మొదటి రోజు ఒకరు నామినేషన్ దాఖలు చేయగా, రెండో రోజు మరో నామినేషన్ స్వీకరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ వెల్లడించారు.

## మహారాష్ట్రలో మరట్వాడా ఆందోళనతో ఆర్టీసీకి రూ.9లక్షల నష్టం

రెంజల్, నవంబర్ 4: బోధన్ ఆర్టీసీ డిపో నుంచి నాలుగు రోజులుగా ధర్మాబాద్, నాందెడ్, బీదర్, దెగ్లూర్, ఔరాద్ రోట్లలో బస్సుసర్వీసులు నడవకపోవడంతో ఆర్టీసీకి సుమారు రూ.9లక్షల నష్టం వాటిల్లిందని బోధన్ డీఎం మామిడాల శ్రీనివాస్ శనివారం తెలిపారు. మహారాష్ట్రలో మరట్వాడా రిజర్వేషన్ల కోసం నాలుగు రోజులుగా అక్కడి ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. బోధన్ నుంచి రెంజల్ మండలం కందకుర్తి మీదుగా ధర్మాబాద్, నాందేడ్, దెగ్లూర్, బీదర్, ఔరాద్ ఐదు రూట్లల్లో బస్సులను రద్దు చేశామని తెలిపారు. చార్జీల రూపంలో సుమారు రూ. 9.లక్షల మేరకు ఆదాయానికి గండి పడిందని డీఎం పేర్కొన్నారు.

**బస్సుల సర్వీసులు ప్రారంభం**

అక్కడ పరిస్థితి చక్క బడడంతో శనివారం నుంచి బస్సు సర్వీలను పునరుద్ధరించినట్లు డీఎం మామిడాల శ్రీనివాస్ తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించి సురక్షితంగా ఇంటికి చేరాలని కోరారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శక్కర్‌నగర్, నవంబర్ 4: బోధన్ పట్టణంలోని తట్టికోట్ నాగయక్షిణి ఎల్లమ్మ ఆలయ 11వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు పలు క్రీడాపోటీలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అబ్బయ్య, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.